

# పొద్దుకుంకింది

పులికంటి కృష్ణారెడ్డి

"మంగా!"

"ఊఁ.... ఆఁ! ఆఁ!....ఊఁ?"

"అట్టా మూలగతావుండావే?.... ఎట్టుండాదె వొళ్ళు?"

"ఒళ్ళంతా నలగ్గొట్టేసి నట్లుండాది. కాళ్ళూ చేతులు కుక్కలు పీకినట్లు పీకేస్తా వుండాయి. ఎట్టెట్నో సఁవాళించుకోని లేద్దావంటే సాద్దిపడకుండా వుండాది. ఏం జెయ్యమంటావు సెప్పు మాఁవా?"

"ఏఁవి జలమాలో యెదవ జలమాలు!.. ఇట్టాంటి బతుకులు బతికే దానికంటే సచ్చేది మేలే?"

"ఊఁ! .... అదేంటి మాఁవా అట్టం టావే?"

"లేకుంటే నువ్వట్లల్లాడ్తా వొల్లాడ్తా వుండే నీకంత గొంతులో మందోమాకో పొయ్‌లేని ముదనష్టపోణ్ణి. ఎందుకు బతకాల్నేను?"

"అట్టనుకుంటే నేను గూడా అంతేకద మాఁవా" మూడుదినాల్నుండి నువ్వా మంచాన పడుంటే నేను మాత్తరం యేం జేస్తావుంటా?"

"అందుకే గదంటే యిట్లా బతుకులు బతికేదానికంటే సచ్చేది మేలనింది?"

"అట్టనుకుంటెట్లా మాఁవా?....యింక బిడ్ల గతేం కావాలి?...ఒక్కరా యిద్దరా? ఆరుమందే?.... అందరూ మొగబిడ్లేనే?"

"అవునే! అందరూ మొగబిడ్లే! నోరు

గట్టి, కడుపుగట్టి పెంచి పెద్దోళ్ళనేస్తే
రేపొద్దున వాళ్లు కుచ్చులకుళ్ళాయి పెట్ట
బోతారు. ఆ కుళ్ళాయిలు పెట్టుకోని
మనం కులకబోతాం!"

"ఏందో ?.... ఈ పొద్దు జరం తగిలి
యిట్లా మాట్లాడ్తావుండావ్ కానీ, వాళ్ళ
మీంద ఈగో ల్తే యిర్సకపడ్తావుంటావే!"

"కదా మరి ? ఈగో ల్తే యి ర్స క
పణ్ణు!.... ఈ పొద్దు మూలకొకడు యీల
గర్చుకోని పడుంటే సూస్తా వూరుకొ
నుండా!"

"ఎందుకు మాఁవా బాదపడ్తావ్ ?"

"బాద?.... హ్హ హ్హ హ్హ!.... ఎందుకే
బాద? బిడ్డల్ని కన్నతల్లి బిచ్చం పెట్టిన
తల్లి ఎప్పుడూ సెడిపోరుగదే?.... అవిర్చి
పెట్టినట్లు ఈ యిల్లు.... అడిగిందడిగినట్లే
అందిస్తా యిల్లాలు .... కళకళలాడ్తా పిల
కాయిలు! .... ఏం తక్కువే నాకు?
ఎందుకే బాద ?"

"నువ్వా నేనే యిట్లా దిగులుపడి
పోతే పిలకాయల గతేంకావల్ల మాఁవా?
ఊరుకో మాఁవా ఊరుకో?.... వొచ్చిన
జెరం వదలకుండా పోదు. మనం లేసి
తిరక్కుండా పోఁవు. లేసి తిరిగితే మన
కేం మాఁవా! అందరూ మొగబిడ్డే కదా?
ఈరాది యీరుళ్లు సూరాది సూరుళ్ళవు
తార్లేమాఁవా?"

"అవతారే!....అవతారు. ఎందుగ్గారు!
ఈరాది ఈరుళ్ళు సూరాది సూరుళ్ళవ
తారే!.... ఎందుగ్గారు?....హ్హ హ్హ హ్హ!"

మాకడు విరగబడి నవ్వుతున్నాడు.
విరగబడి నవ్వుతూంటే విపరీతంగా
దగ్గు వచ్చింది. నవ్వుతో కలసి
దగ్గు.... దగ్గుతో కలసి నవ్వు. పాలు
నీళ్ళలా కలగలిసినాయి. మూన్నాళ్ళుగా
పచ్చి మంచినీళ్లు నోట్లో పొయ్‌లేదు.
కండ్లు తిరుగుతున్నాయి. కడుపులో
చెయ్యేసి కలబెట్టినట్లుగా వుంది. కాళ్ళు
చెప్పినమాట వినటంలేదు. నిలబడలేక
పోతున్నాడు.ముక్కుతా మూలగతావుండే
పెండ్లాం పక్కన్నే కూలబడితే మూలిగే
నక్కమీద తాటికాయ పడినట్లవుతుంది.
అందుకే మెల్లగా బయటికి నడిచాడు.
గుడిసె ముందర కుక్కిమంచంలో కూల
పడినాడు.

మాకడిఅయ్య మంగపతి. పోతూ
పోతూ గుడిసెతోపాటు మిగిలించిపోయిన
మంచమిది. దారాలు సళ్లాదిలి ఆకలిగొన్న
కడుపులా గుంతపడి ఉంది. అక్కడొకటి
అక్కడొకటిగా తెగిన దారాలు ఆకలి
గొన్న కడుపులో తెగిన ప్రేవుల్లా వేలాడు
తున్నాయి. మాకడా గుంతలో కూలబడి
నాడు. మంచం కిర్రుమనింది. ఆ అరుపు
ఆకలిగొన్న ప్రేవుల అరుపులా వినిపిం
చింది. ఆ ఆకలి బాధకు తట్టుకోలేక ఆ
కడుపుమీద తడిపి పిండిపెట్టిన తడి
గుడ్డలా ముడుచుకొని కూర్చున్నాడు
మాకడు.

మాకడి మనస్సు మధనపడిపోతూ
ఉంది.

మంగ గుండెలు మండిపోతున్నాయి.

"ఆకలమ్మా! ఆకలమ్మా!!" అంటూ అంతవరకు అమ్మను సతాయించిన ఆరుమంది పిల్లల్లో నలుగురు ఆమాట పలకడానికి కూడా శక్తిలేక ఆ గుడిసెలో పడివున్నారు — మూలకొకరుగా, పెద్దోడు, రెండోవాడు మధ్యాహ్నమనంగా వెళ్ళిపోయినారు. ఎక్కడికి వెళ్లారో? యేమో?

ఇంచుమించుగా రెండుబార్ల పొద్దున్నట్లుంది. అప్పటికే గుడిసె ముందర చింతచెట్టుమీద కాకులు చేరుతున్నాయి. కొంపలు కూలిపోతున్నట్లో, కాలిపోతున్నట్లో అవి ఒక్కమోపన అరుస్తున్నాయి. వీధిలో కుక్కలు రకరకాలుగా మొరుగుతున్నాయి. ఆ కుక్కిమంచంమీద కూలబడి మాకడు రకరకాలుగా ఆలోచిస్తున్నాడు.

* * *

అందమైన మొగం అంచులో అవతరించిన పులిపిరిలా ఆ పల్లెచివరన వెలసిన హరిజనవాడ అది. ఆ వాడలో దాదాపు నలభై కడపలున్నాయి. కొన్ని గుడిసింటి కడపలు...మరికొన్ని మూడంకణాల పూరింటి కడపలు. ఈ కొంపల్లో మనుష్యులున్నారు. ఆ మనుష్యుల శరీరాల్లో నరాలున్నాయి. ఆ నరాల నిండుగా రక్తముంది. ఆ రక్తంలో శక్తి వుంది. ఆ శక్తి కరెంటులాంటిది.

ఈ నాగరిక ప్రపంచంలో కరెంటు లేకపోతే ఒక్క క్షణం జరగదు. అయితే మనం కరెంటును ముట్టగలుగుతున్నామా?

హరిజనుల విషయంలోకూడా అంతే!

వాళ్ళుకాదు మనకు కావలసింది. వాళ్ళ శక్తి మాత్రమే!

వాడలోని నలభై కడపల్లో ఒక్క గుడిసింటి కడప మాకడిది. ఆ గుడిసింట్లో మాకడు తన పెళ్ళాం మంగతో, ఆరుమంది కొడుకులతో కలిసి కాపురం చేస్తున్నాడు.

మాకడికి పెండ్లయి ఎనిమిదేండ్లు అయింది.

వాడి అమ్మా నాయనా చెల్లి పొయ్యి యేడేండ్లయింది.

— అంటే, పెండ్లయిన ఏడాదికే అమ్మా నాయన పొయ్యేసరికి ఊరంతా అదోరకంగా చూసి, 'గాటికి గొడ్డు, దొంతికి కడవ, యింటికి యిల్లాలు వచ్చిన వేళావిశేషం!' అని మూతి మూడువంకర్లు తిప్పింది. అయితే ఆ మరుసటి సంవత్సరానికే మంగ మగబిడ్డను కనేటందికి 'అంతా వాళ్ళ తాత పోలికేనమ్మా! అదురుష్టవంటే మాకడిదే!' అని తెగ పొగిడేసింది.

మాకడు కూడా పసికందులో తన అయ్యను చూచుకొని తెగ మురిసిపోయినాడు.

నెలలు తిరక్కముందే మంగ మళ్ళీ నీళ్ళుపోసుకొనింది! ఏడాది తిరగకముందే కనింది. ఈ సారికూడా మగబిడ్డే!

"మంగనేఁవో అనుకుంటివే! వర్సగా

మొగబిడ్డనే కంటూవుండాదే! ఇంకే వుండాది మాకడికి?.... కూసోని తిండే కూడు."

ఊరు ఊరంతా ఒకపైనట్లు అభినందన పరంపరల్ని గంపలకెత్తి కుమ్మరించినారు. మంగా మాకడు ఒకరిమొగం ఒకరు చూచుకుంటా నవ్వుకుంటా ఉబ్బితబ్బిబ్బులైనారు.

అట్లా ఉబ్బితబ్బిబ్బు లవుతూవుంటే మంగ పొట్ట కాస్తకాస్త ఉబ్బుతున్నట్లుగా కనిపించింది. అవునో? కాదో? అని తడిమి చూసుకునేసరికి తొమ్మిదో నెల వచ్చేసింది.

మంగ మళ్ళీ నీళ్ళాడింది!

ఈసారి కూడా మగబిడ్డే!!

వాడలోని యిరుగూ పొరుగూ దీన్నంతగా పట్టించుకోకుండా 'దీని జాతకంవే మొగబిడ్ల జాతకంగా వుండాదే!' అని సరిపెట్టుకొన్నారు.

ఇంట్లో యిద్దరికిద్దరుకాదు....యిద్దరికి ముగ్గురయ్యేప్పటికి మాకడు ఒక్కడు తెచ్చే కూలి పట్టుపట్లుగా సరిపోతూవుంది. అయినా వాడు పట్టించుకొనే స్థితిలోలేదు. 'అందరూ మొగబిడ్లే కదా? ఏదో ఒక విధంగా సర్దుబాటు కాకపోతుందా?' అన్న ధీమాతో తిరుగుతున్నాడు.

మాక డట్లా ధీమాగా తిరుగుతూంటే-అంతకంటే ధీమాగా మంగ మళ్ళీ మగబిడ్డనే కని 'మగబిడ్డల జాతకురాలేకాదు. ఏటా బాలెంతరాలు' అన్న బిరుదు ప్రదానానికి అర్హత సంపాదించుకొనింది.

మంది ఎక్కువయితే మజ్జిగ పలచనవుతుంది.


మాకడు తింటున్న తిండిలో రెండు పిడచలు తగ్గించవలసివచ్చింది.

వంచిన నడుము పైకెత్తకుండా పని చేసే కూలోడు మాకడు. ఏది తగ్గినా తట్టుకోగలడేమోకానీ, పిడచ తగ్గితే పీకులాటే! అందుకే ఆలోచించినాడు. పొలంలో పనిచేసుకుంటా ఆలోచించినాడు. ఇంటిముందర కుక్కిమంచాన కూలబడి ఆలోచించినాడు. అట్లా ఆలోచిస్తావుంటే తళుక్కున మెరుపు మెరిసినట్లొక ఆలోచన తట్టింది.

ఆలోచన కలగడమే తరువాయి. అదరాబాదరా పెండ్లాన్ని పిలిచినాడు. చంకబిడ్డ ఒకపక్క చన్ను కుడుస్తూంటే దోగాడే పిల్లోడు చీరబట్టి లాగుతూంటే మంగ ఎట్లో తెములుచ్చుకొని వచ్చి మగని పక్కన కూర్చొనింది- 'ఎందుకు పిలిచింది?' అన్నట్లుగా చూస్తూ!

"సూడు మంగా! సంపాయించేదొకడు. తినాల్సిం దారుమంది. బిడ్లా పెరిగి పెద్దోళ్ళయిపోతావుండారు. పెరిగేవోళ్ళకు పెరుకొక్కడు కాకపోయినా యాళకింత తిండిపెట్టాలి కదా!"

"వాళ్ళకు పెట్టకుండా నేనే తినేస్తావుండానంటావా మాంవా? నువ్వు జెప్పేదింకా యిచ్చిత్రంగా వుండాదే?.... ఒక పూట కడుపుగట్టి వాళ్ళకు పెడ్తావుంటే!"




"ఒసే నీ యమ్మను గొట్టా! నే జెప్పే దదిగాదే! నేను పూటకు రెండు పిడసలు తగ్గిస్తే నువ్వొకపూటే కడుపుగట్టుకుంటా వుండావ్? నేను కాదనలేదే?"

"అయితే నువ్వనేదేంది?"

"నిప్పుమిందుప్పు మాదిర నువ్వెగిరి పడ్తావుంటే, యింక నేనేం జెప్పేది?"

"ఎగిరీపళ్లా? వొరగాపళ్ళా? సెప్పింటాను."

"ఇంతకాలంపూ నిన్ను గడపదాటి కాలు బయట పెట్టకుండా కాపాడుకున్నా? యిప్పుడు చెప్పాలంటే మనుసెట్టట్లో పోతావుండాదే?"

"అదేంది మాఁవా అట్టంటావే! నువ్వు జెప్తే నే నెప్పుడు కాదనింది?"

"అవుననుకో!"

"అనుకోగినుకోనులే! సెప్పింటాను."

"పదుగు దూరంలో పరవగుట్ట. గుట్ట దడిలో దండిగా ఎండుపుల్లలు. దినంపూ పాలు మారకుండా పొయ్ ఒక మోపు కట్టితేరకొచ్చుకుంటే, సన్నీళ్ళకు యేనీళ్ల తోడయినట్లుంటాది. ఏఁవంటావే?"

"అంతే గద మాఁవా! అట్లానే జేస్తే పోలా!"

ఇప్పుడు దినమూ మంగ పరవగుట్టకు పొయ్యి కట్టెలు తెస్తావుంది. ఊళ్ళో ఏ నాయుడమ్మకో, రెడ్డమ్మకో వేసి గట్టి గింజలయితే మానెడు, పొట్టు గింజలైతే రెండు మానికలు తెచ్చుకుంటా వుంది. మాకడు ఒక్కరోజు తప్పకుండా కూలికి వెళ్ళుతూనే ఉన్నాడు.

ఇంట్లో యిప్పు డందరికీ నాలుగు వేళ్ళు నోట్లోకి పోతున్నాయి.

మాకడు తన ఆలోచన పారిందని ఆనందపడిపోతున్నాడు.

మగనికి తోడుపడుతున్నానని మంగ సంబరపడిపోతావుంది.

మాకడి ఆనందానికి మంగ సంబరానికి ఆకాశమే హద్దనుకొంటే- వాళ్ళకు మళ్ళీ వయసు వచ్చినట్లనిపించింది. అట్లను కుంటా వుండగానే, గుడిసె ముందర చింతచెట్టు రెండుసార్లు పచ్చగా చిగురించింది. మాకడి యింట్లో జనాభా కూడా ఆ చింతచెట్టుతో పోటీపడినట్లుగా పుష్పించి ఫలించి ఆరునుండి ఎనిమిది కెదిగింది.

అందరు కొడుకులన్న ధైర్యం. మాకడికి చీమ కుట్టినట్లనిపించలేదు. చీమకు దోమకు తిండిపెట్టే దేవుడే తమకూ అంత గంజిపోస్తాడన్న గట్టి నమ్మకంతో ముందుకు పోతున్నాడు.

* * *

ఇప్పుడున్నట్లుండి అదేదో మాయదారి జ్వరం వాడమీద దాడిచేసింది. వాడ వాడగా దీని వాతబడింది. ఒక్కరోజు వెనకాముందుగా మంగా మాకడు కూడా పడకేసినారు. మంగ గుడిసింట్లో గోనె పట్టెమింద, మాకడు గుడిసె ముందర కుక్కిమంచాన!


మంగా మాకడు పడకబెట్టి అప్పటికి మూన్నాళ్ళయింది.

కూలిచేస్తే కుండ గాలు లేకుంటే కడుపు గాలు!- బతుకుల్లో వరసగా మూన్నాళ్ళు కూలికి పోకపోతే కుండెట్లా పొయ్యిమీది కెక్కుతుంది? పొయ్యిలో పిల్లి పడుకుంటే మాకడు ఆరుమంది బిడ్డల్ని యే గంపకిందేసి మూసిపెడ్తాడు?

కుక్కిమంచాన కూలబడి అదే ఆలో చిస్తున్నాడు మాకడు.

అట్లా ఆలోచిస్తావుండిన మాకడు ఏఁవో యేడుపులు చెవిని పడేసరికి తల పైకెత్తి చూచినాడు. పైకి లేవలేక లేచినాడు. ఆ దృశ్యాన్ని చూస్తుంటే కంటి మీద రెప్పపడలేదు.

కుడిచేత్తో ఒకడి జుట్టును, ఎడమచేత్తో యింకొకడి జుట్టును పట్టుకోని యిద్దరు పిలకాయల్ని బరబరా యీడ్చుకొస్తున్నాడు వీరారెడ్డి. గుండెలవిసిపోయేటట్లుగా ఆ పిల్లోళ్ళు యేడుస్తున్నా, వీరారెడ్డి లెక్క పెట్టకుండా యీడ్చుకొస్తున్నాడు. ఆ పిల్లోళ్ళుయేం తప్పుచేసినారో? యేఁవో? అర్థంకాకుండా అయోమయంగా చూస్తు




న్నాడు మాకడు. నిలువు రాయిలా నిల బడినాడు.

ఆ పిల్లోళ్ళిద్దర్నీ వీరారెడ్డి రెండు చేతులతో అవలీలగా పైకెత్తి విసిరేసినాడు మాకడి కాళ్ళముందర పడేటట్లుగా! ఎత్తి కుదించివేస్తే మట్టిముద్దలా కుప్పగా కూలపడినారా పిల్లోళ్ళిద్దరూ!

"నాన్నా!" అంటూ ఆ పిల్లోళ్ళు మాకడి కాళ్ళకు చుట్టుకున్నారు.

"సాకలేని నా కొడకలకు సంతెందు కురా? కంటే సరిపొయ్యిందా పంది కన్నట్టు. అదే మేలు. పదికిరవై పిల్లల్ని కన్నా అట్టా సూడు చింతచెట్టు కింద- అన్నింటి కెట్లా పాలిస్తావుండాదో? మా సెరకుతోట్లు, సెనిగతోట్లు నీ కొడకల కోసరం కాదురా మేం వేసిపెట్టుండేది? జాగర్త! నా యాండ్లాలా! యింకెప్పుడైనా ఆ ప్రక్కకు తొంగి మళ్లీ సూసినారో?- తాటొలిసేస్తా!"

ఏదో ఘనకార్యం చేసినట్లుగా వీరా రెడ్డి బుసలుకొడతా విసవిస వెళ్ళిపోయి నాడు.

"ఆకిలిగా వుంటే రెడ్డోళ్ళ సెనిగ తోట్లో రొండు సెట్లు పెరుక్కున్నాం నాయినా!"

చెప్పలేక చెబుతూ 'బోరో'మని యేడుస్తున్నారు పిల్లోళ్ళు!

ఆ యేడుపులు మాకడి చెవినిపడడం లేదు. వీరారెడ్డి మాటలే చెవుల్లో గింగురు మంటున్నాయి. 'సాకలేన్నాకొడకలికి సంతెందుకురా?' అని.

అవును మరి?- సాకి సంతరించ లేనోళ్ళకి సంతానమెందుకు?

కుక్కి మంచాన కూలబడి మాకడు అదే ఆలోచిస్తున్నాడు.

వీరారెడ్డి గుద్దిన గుద్దులు పిల్లోళ్ళ ఒంటిమీద కుడుములు కుడు - లుగా దద్దులు కట్టినాయి. ఆ దద్దుల్ని తడిమి తడిమి చూస్తూ మంగ కుమిలికుమిలి యేడ్చింది. అట్లా యేడుస్తూవుంటే ఎన్నో ఆలోచనలు ఆమె గుండెల్ని నలుపుతున్నాయి. వీరారెడ్డి గనిమమీద పంచ కొంగు పైకెత్తిపట్టి నిలబడుకోనుంటే తన మగడే ఆ చేనిలో మడకదున్నినాడు. విత్తనాలు విత్తినాడు. నీళ్ళు గట్టినాడు. కలుపు తవ్వినాడు. అయినా ఆ చేనిలో రెండుచెట్లు పెరుక్కోవడానికి తమకు యోగ్యత లేదు! ఆ మాట మనస్సులో మెదిలేసరికి మంగ గుండె మండింది.

అయితే ఏం లాభం?

పేదవాళ్ళ కోపం పెదవికి చేటు!

మంగ మెల్లగా పైకిలేచింది. గుడిసింటి వెనక్కు నడిచింది. నాలుగు పుల్లా పుడకలు యేరుకొనింది. తెచ్చి పొయ్యిలో వేసింది. కిరసనాయిలు సీసా చేతికందుకొని పొయ్యిలోని పుల్లలమీద వంచింది!

ఆ పుల్లలమీద కిరసనాయిలు కాదు కారింది_ఆమె కన్నీళ్ళు! నిట్టూరుస్తూ అగ్గిపెట్టె అందుకొని పొయ్యి ముట్టించింది. రగలలేక రగులుతున్నాయి ఆ పుల్లలు. పొయ్యిమీద చట్టిబెట్టి, ఉప్పుచట్టిలో చెయ్యి పెట్టింది!

పిల్లోళ్ళ ఒంటిమీద దద్దులకు కాస్త కాపడం వేద్దామంటే నాలుగు ఉప్పురాళ్ళు చేతికందలేదు. ఉసూరుమంటూ ఆ పొయ్యిముందరే కూలబడింది.

పొద్దుకుంకింది!

మాకడు మంచానపడి ఆలోచిస్తూనే ఉన్నాడు. ఏడ్చిఏడ్చి పిల్లోళ్ళు ఎక్కడి వాళ్ళక్కడ పడి నిద్రపోతున్నారు. తనలో తాను ఎంతసేపు యేడ్చుకొనిందో యేమో?_ మంగ తనకు తానే ఓదార్చుకొని లేవలేక పైకిలేచింది. మెల్లగా గుడిసె ముందరి మంచం దగ్గరికి నడిచింది.

"అట్లా కూర్చుంటే ఎట్లా మావా? పిలకాయిలకంత గెంజి కాసిపోసి రొండు దినాలయింది గదా?.... యాడైనా అంత అప్పోసప్పో లేకపోతే ఎట్లా?"

"పొద్దుగుంకింది గదే?_ ఇంకిప్పుడేడ పుడుతుంది?"

అవును. ముందు చూపులేకుండా ప్రవర్తించిన బతుకుల్లో పొద్దుకుంకడమే సహజం. పుట్టడమే అసహజం!

